క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన



వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాలుపై లింక్ వర్కర్ స్కీం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ కె.సురేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏబీసీ సూత్రం గురించి వివరించారు. అనంతరం కరపత్రాలు మరియు పోస్టర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్, సర్పంచ్ పెనుమాల సుమలత, వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి రామిరెడ్డి, సీహెచ్ఓబీ కుమారి, ఏయన్ఎంపీ విజయమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఎ.ఆదిలక్ష్మి, ఎ. ప్రభావతి, వై.రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు కోటేశ్వరమ్మ, లీలమ్మ, లింక్ వర్కర్స్ పి.శైలజ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీను ఢీ కొన్న మరో లారీ



నరసరావుపేట టౌన్: బత్తాయి లోడ్తో రాంగ్ పార్కింగ్లో నిలిపి ఉన్న లారీను మరో లారీ ఢీకొట్టిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తాయి లోడ్తో పట్టణంలోకి ప్రవేశించిన అశోక్ లైలాండ్ లారీ నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం మల్లమ్మ సెంటర్లో నిలిపాడు. ఆ సమయంలో వెనుకగా వచ్చిన మరో లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. సంఘటనలో రెండు లారీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. రాంగ్ పార్కింగ్లో నిలిపినందుకు, అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదం చేసినందుకు రెండు లారీల డ్రైవర్లు పాల్వాయి సైదులు, మేరు సుందరారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం. హైమారావు తెలిపారు.

రైతు సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



చిలకలూరిపేట: రైతుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం మార్కెట్ యార్డు ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. రైతులకు మేలు చేసేందుకు కమిటీ సభ్యులతో పాటు అధికారులు పనిచేయాలని సూచించారు. పాత-కొత్త మార్కెట్ యార్డులో మరమ్మతు పనులను పూర్తి చేసేందుకు అవసరమైన అంచనాలను అధికారులు రూపొందించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రహరీల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. మార్కెటింగ్ సౌకర్యాలను విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ-క్రాప్లో పంటలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఉన్నతశ్రేణి కార్యదర్శి తిరుపతి రాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందరూ ఉన్న అనాథ!!



నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన యాభై ఐదేళ్ళ ఈవ్యక్తి కటకంశెట్టి సాంబయ్య. ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. ఇంట్లో ఆర్థిక బాధల వలన చదువు మానేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. అనంతరం వివాహం కాగా, సుమారు పదేళ్ల క్రితం భార్య దూరమైంది. ఇరువురు కుమారులు తల్లి వద్దనే చదువుకుంటూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అప్పటి నుంచి సాంబయ్య చిలకలూరిపేటలోని ఓ పొగాకు కంపెనీలో ఆఫీస్ బాయ్గా పనిచేస్తున్నాడు. సుమారు ఏడాది క్రితం తాగుడుకు బానిస కావటంతో కంపెనీ యాజమాన్యం తొలగించింది. అప్పటి నుంచి అనారోగ్యంతో పూర్తిగా మంచాన పడ్డాడు. సోదరుడు, కుమారులు ఉన్నా పట్టించుకోకపోవటం, గణపవరంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న బస్టాప్లో అనాథగా పడిఉండటంతో స్థానికులు జాలిపడుతున్నారు.

మోటారు వైర్లు చోరీ



సాతులూరులో వ్యవసాయ మోటారు పంపుసెట్టు విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. తన వ్యవసాయ భూమిలో విద్యుత్ మోటారు బిగించుకుని వ్యవసాయం చేసుకుంటున్నానని, అయితే బుధవారం రాత్రి సుమారు రూ.6 వేలు విలువైన విద్యుత్ తీగలను దొంగలు కత్తిరించి చేసుకుని వెళ్లారని రైతు వజ్జా లింగయ్య వాపోయాడు. పోలీసులు దృష్టి సారించి దొంగతనాలు నియంత్రించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

–నాదెండ్ల

ఆచార్యదేవోభవ



ఎస్ఆర్కే కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు తాము దాచుకున్న డబ్బుతో కేక్ తీసుకువచ్చి ఉపాధ్యాయులచే కట్ చేయించి వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సుధాకర్, ఎం.అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

–నరసరావుపేట రూరల్

అవగాహన సదస్సు



పిచికలపాలెంలో ఎయిడ్స్ వ్యాధిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల సోకుతుందని చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం ప్రాజెక్టు జోనల్ సూపర్వైజరు బోను నాగేశ్వరరావు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గణపర్తి ఆంజనేయులు, ప్రదీప్ కుమార్, ఆరోగ్య కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.

– శావల్యాపురం

ఎల్ఐసీ వారోత్సవాలు



ఎల్ఐసీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో డెవలప్మెంట్ అధికారి ఆరె శివారెడ్డిని ఏజెంట్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏజెంట్లు మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగులను ఎల్ఐసీ సంస్థలో ఏజెంట్లుగా చేర్పించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన శివారెడ్డి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు గంధం బాలిరెడ్డి, పోలూరి అర్చనామూర్తి, మాదాల హనుమంత రావు, కోటిరెడ్డిలతో పాల్గొన్నారు.

–వినుకొండ

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాలు ఏర్పాటు చేస్తాం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ ఆనంద్ మాదిగ



నూతన సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శావల్యాపురం: జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య సారథ్యంలో నూతన కార్యవర్గ ఎంపిక చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ గుండాల ఆనంద్ మాదిగ వెల్లడించారు. గురువారం మండల స్థాయి సమావేశం శావల్యాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగ వర్గీయులు సారథ్యంలో ఈనెల 22న తెలంగాణా రాష్ట్రం హైదరాబాదు రవీంద్ర భారతిలో వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్రెడ్డి కృతజ్ఞత సభకు అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వినుకొండ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కలుపుకూరి ఏసురత్నం, ఇన్చార్జ్ పచ్చిగోర్ల సుధాకర్లను ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నేతలు కోట సుబ్బు, కందుల జార్జి, గార్లపాటి రమేష్, పలుకూరి రామారావు, ఏసుబాబు, సందీప్, డేవిడ్, రాజకుమార్, జీవన్ ప్రసాదు పాల్గొన్నారు.

లక్షణంగా లక్ష పలికిన లడ్డులు



ద్విచక్రవాహనం గెల్చుకున్న వ్యక్తికి తాళాలు అందజేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట: వినాయక చవితి సందర్భంగా పదో వార్డు సెయింట్ జోసెఫ్ స్కూలు సమీపంలో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన చవితి పందిరిలో గురువారం వినాయకుని నిమజ్జనోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పందిరి నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి సమర్పించిన రెండు లడ్డూలకు వేలం పాట నిర్వహించగా పెద్దలడ్డును మార్పుల్ బ్రహ్మారెడ్డి రూ.77వేలకు పాడి దక్కించుకోగా, చిన్న లడ్డును సోమశేఖర రెడ్డి రూ.33వేలకు పాడి దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన లక్కీ డ్రాలో మొదటి ప్రైజ్ సుమారు రూ.1 లక్ష విలువైన ద్విచక్రవాహనాన్ని కామిరెడ్డి ప్రవీణ్కుమార్ దక్కించుకోగా, ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ను గుర్రం మౌనిక, తృతీయ బహుమతి టేబుల్ టాప్ గ్రైండర్ను విజేత షాపు నిర్వాహకులు అర్వపల్లి వెంకట నరసింహారావు దక్కించుకున్నారు. అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయకుడిని మేళతాళాల మధ్య భక్తులు ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి తరలించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ రైతు సేవా కేంద్రంలో పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి పాల్గొని మాట్లాడుతూ పత్తి రైతులు అధిక ఆదాయం పొందాలంటే తప్పనిసరిగా అంతరపంటల సాగు విధానం పాటించాలన్నారు. పత్తిని ఏ గ్రేడ్ మోడల్ క్రింద పరిగణించి ఇందులో సజ్జ, గోరుచిక్కుడు, అనుములు, పెసలు, వంగ, బెండ, టమాటా వంటి అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. పత్తి పంటలో జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుంటే కీటకాలు నివారించుకోవచ్చని, వేపకషాయం వినియోగంతో చీడపీడలు తగ్గుముఖం పడతాయన్నారు. తక్కువ ఖర్చుతో సమగ్ర యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, అరుణ, సిబ్బంది సైదయ్య, సౌజన్య, కరీమూన్, స్వాతి పాల్గొన్నారు.

అక్షర కార్మికుడు మన గురువు



డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నమస్సుమాంజలి తెలియజేస్తున్న ఉపాధ్యాయులు



పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత

నూజెండ్ల: మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దటంలో గురువుల పాత్ర వెల కట్టలేనిదని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు.మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం స్మరించుకుంటూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది సెలవు రావటంతో ముందు రోజున అన్ని పాఠశాలల్లో జరుపుకోవటం జరిగిందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

నూజెండ్లలోని పీయంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణతో పాటు ఎంఇవో-2 రవిచంద్ర, శావల్యాపురం ఎంఇవో సాంబశివరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇవో సత్యనారాయణ మాట్లాడు తూ ఓ వ్యక్తిని కనిపెంచేది అమ్మ, నాన్న అయితే సమాజంలో ఎలా మెలగాలో తెలిపి విద్యాబుద్ధులు నేర్పేది గురువులేనన్నారు. రవిచంద్ర మాట్లాడుతూ అజ్ఞాన పొరలు తొలగించి జ్ఞాన దీప్తిని వెలిగించేవారు మన ఉపాధ్యాయులేనన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని నిర్మలా ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాసరావు ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలకు 12 ఫ్యాన్లను శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ బెన్ డిక్టా, ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

సెపక్ తక్రా సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఎంపికలకు పల్నాడు జిల్లా నుంచి బాలుర విభాగంలో 35 మంది, బాలికల విభాగంలో 20 మంది హాజరయ్యారు. వీరిలో బాలుర జట్టుకు కె.చిరంజీవి, ఎం.మనోహర్, డి.జాన్సన్, కె.శ్రీనాథ్, టి.ప్రవీణ్ కుమార్, స్టాండ్ బైలుగా ఆర్. సంతోష్, కె.శామ్యూల్ రాజు, కె.సాత్విక్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఒ.దీవెన, పి.గాయత్రి, కె.గీతిక, బి.కెజియా, బి.అహల్య, స్టాండ్ బైలుగా డి.స్వరూప, కె.థెరిస్సారాణి, కె.సంగీతలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్షిప్లో పాల్గొంటారని పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి పి.శివరామకృష్ణ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్త నాయక్, వై.చిరంజీవి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 కార్యదర్శి జి.నరసింహారావు, ఆదిత్య ఫిజికల్ ఎడ్యుకేషన్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, విద్యాకేంద్రం జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు, తోక సోమనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, కోణంకి కిరణ్ కుమార్, ప్రసన్న, మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డివిజన్ మార్పు నిర్ణయం సరికాదు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో ప్రజలకు అందుబాటులో ఉన్న విద్యుత్ కార్యాలయాన్ని చిలకలూరిపేటకు తరలించటం సరైన నిర్ణయం కాదని సీపీఎం పార్టీ రొంపిచర్ల మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రొంపిచర్ల మండలంలోని విద్యుత్ డివిజన్ నరసరావుపేట నుండి చిలకలూరిపేటకు మార్చటం వల్ల నకరికల్లు, ఈపూరు, శావల్యాపురం, రొంపిచర్ల మండలాల ప్రజలు, విద్యుత్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్ననరసరావుపేట డివిజన్లోని మండలాలను చిలకలూరిపేట డివిజన్లో కలపటం సమంజసం కాదన్నారు. ఈ విషయమై గత నెల 25వ తేదీన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ ఈ విషయాన్ని సంబంధిత అధికారులను పరిశీలించాలని ఆదేశించారు. అయితే విద్యుత్ అధికారులు ఈ విషయం తమ పరిధిలోది కాదని బోర్డు నిర్ణయమన్నారు. స్మార్ట్ మీటర్లతో వచ్చే అత్యధిక బిల్లులు చెల్లించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని చిలకలూరిపేటకు మార్చటం విడ్డూరంగా ఉందన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

డిప్యూటీ డీఈవో మహబూబ్ సుభాని



భోజనం పరిశీలిస్తున్న మహబూబ్ సుభాని, సత్యనారాయణ సింగ్

చిలకలూరిపేట: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందజేయాలని డిప్యూటీ డీఈవో మహబూబ్ సుభాని చెప్పారు. మండలంలోని పసుమర్రులో ఉన్న జెడ్పీ హైస్కూల్ను స్థానిక ఎంఈవోతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులు కూడా పదో తరగతి ఒక మైలురాయి వంటిదని గుర్తించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గురు పూజోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత హెచ్ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు, పాఠశాల గణిత శాస్త్ర సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్.శంకర రావును సన్మానించారు. ఎంఈవో సత్యనారాయణ సింగ్, స్కూల్హెచ్ఎం వై.హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల పరిధిలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్ప్రెస్వేపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తల మొత్తం ఛిద్రమైందని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఆకుపచ్చ రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు రొంపిచర్ల పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రొంపిచర్ల వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

విజయలక్ష్మీ ట్రేడర్స్పై జీఎస్టీ అధికారుల దాడులు

నరసరావుపేట టౌన్: విజయలక్ష్మీ ఆయిల్ ట్రేడర్స్పై జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి రోడ్డులోని విజయలక్ష్మి ట్రేడర్స్పై గుంటూరు నుంచి వచ్చిన కస్టమ్స్ అధికారుల బృందం దాడులు చేపట్టారు. ట్రేడర్స్ కార్యాలయంలో అకౌంట్స్ పుస్తకాలు, క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. కొన్ని అకౌంట్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకొని అధికారులను వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఇదిలా ఉండగా గత పది రోజుల క్రితం ట్రేడర్స్ యజమాని సోదరుడిని వ్యాపార సంస్థ ఆయిల్ మిల్ పై కూడా జీఎస్టీ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి మండలల్లో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడ మైందని ఆ ప్రాజెక్ట్ సీడీపీఓ, ఈ వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త, ఈపూరు మండలం కొచ్చర్ల, గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త,అంగన్వాడీ సహాయకురాలు, అంగలూరు, వనికుంట గ్రామాల్లో అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 8 తేదీ నుంచి 20 వరకు ఈపూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు లు అందజేయాలని, వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని సీడీపీఓ, ఈ వాణి చెప్పారు.

గుంతకల్లు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఏపీ రైతు, కౌలు రైతు సంఘ నాయకుల డిమాండ్

నరసరావుపేట: కార్మిక, కర్షక పీడిత వర్గ ప్రజల హక్కులు సాధన, సంక్షేమం కోసం నిస్వార్థంగా ఉద్యమాలు చేస్తున్న రైతు సంఘాల నాయకులపై అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే జి.జయరాం చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని వారికి క్షమాపణ చెప్పాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు ప్రజలకు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. గుత్తిలో జరుగుతున్న బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా ఆందోళనలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని ఓర్వలేక ఆయా సంఘాల నాయకులపై జయరాం అనుచిత వ్యాఖ్యలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. నిస్వార్థ పోరాటాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులను అవమానిస్తే ప్రజా ఉద్యమాలను అవమానించి నట్లేనన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాలన్నారు. అలా చెప్పలేని ప్రజా ప్రతినిధులే అసభ్య పదజాలంతో మాట్లాడతారన్నారు. జయ రాం లాంటి ఎమ్మెల్యేలను అదుపు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందన్నారు. ప్రజా పాలన అని ప్రచారం చేస్తూనే దౌర్జన్య పాలన సాగిస్తున్నారన్నారని దీనిపై ప్రజలు బుద్ధి చెబుతారన్నారని హెచ్చరించారు.

అన్ని దానాల్లో నేత్రదానం చాలా గొప్పది



అంగీకార పత్రం అందజేస్తున్న హెడ్నర్సు కోటమ్మ

నరసరావుపేట: అన్నీ అవయవాల్లో కల్లా నేత్రదానం చాలా గొప్పదని, నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని ప్రభుత్వ వైద్యశాల మెడికల్ సూపరిండెంట్ ఎస్.సురేష్కుమార్ పేర్కొన్నారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ వైద్యశాలలో నేత్రదానంపై అవగాహన శిబిరం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సూపరింటెండెంట్ నేత్రదాన ఆవశ్యకత గురించి వివరించారు. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ ఎ.భువనేశ్వరి మాట్లాడుతూ మృతిచెందిన తర్వాత ఆరు నుంచి తొమ్మిది గంటలవరకు నేత్రదానం చేయవచ్చన్నారు. అన్నీ మతాలు, వయస్సుల వారు నేత్రదానం చేయవచ్చన్నారు. క్యాన్సర్, హెపటైటీస్ బి, ఎయిడ్స్ ఉన్నవ్యక్తులు నేత్రదానం చేసేందుకు అనర్హులని పేర్కొన్నారు. నేత్రవైద్యులు డాక్టర్ హేమశ్రీ మాట్లాడుతూ పెదకాకానిలో నేత్రనిధి బ్యాంకు, కంటి ఆసుపత్రి ఉందని, నేత్రదానం చేసే వారు 99516 04120 సంప్రదించాలని కోరారు. ఈసందర్భంగా హెడ్నర్స్ కోటమ్మ తన నేత్రాలను దానం చేస్తూ అంగీకార పత్రాన్ని మెడికల్ సూపరింటెండెంట్కు అందజేశారు. మరో 30 మంది నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు కూడా అంగీకార పత్రం అందజేశారు. ఆర్ఎంఓ డాక్టర్ ఏడుకొండలు, సిబ్బంది రామకృష్ణ, లక్ష్మీకుమారి, నర్సింగ్ అధికారి జయకరుణ పాల్గొన్నారు.

దుకాణాదారులు నిబంధనలు పాటించాలి

ఈపూరు(శావల్యాపురం): ఎరువులు దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దారు నళిని అన్నారు. గురువారం మండల కేంద్రం ఈపూరులో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు నళిని మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాలు మేరకు ఎరువుల దుకాణాల్లో స్టాకు రిజిస్టరు, రసీదు పుస్తకాలను ఈ-పాస్ మిషన్లో ఉన్న బ్యాలెన్స్ నిల్వలు గోదాంలో ఉన్న ఎరువుల లభ్యతను పోల్చి చూశారు. అదే విధంగా యూరియా డీఏపీ కాంప్లెక్సు ఎరువులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదన్నారు. ఆయనతో పాటుఏవోరామారావు ఉన్నారు.